

పుష్కరాల నాటికి మరింత వన్నె తెస్తాం!

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
సమస్యల పరిష్కారమే లక్ష్యం.. ఆ దిశగా ఒక్కొక్క అడుగు వేసుకుంటూ వస్తున్నా.. ఎందుకంటే నా చిన్నతనం నుంచి ఇక్కడే పెరిగా.. రాజమహేంద్రవరంతో నాకెంతో అనుబంధం ఉంది. ఎక్కడ ఏ సమస్య ఉందనేది నాకు తెలుసు.. అందుకే గెలిచిన వెంటనే ప్రధాన సమస్యలపై దృష్టి సారించా.. ఈ ఏడాదిన్నరలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఇప్పటికే రూ.278 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఐదేళ్లలో సమస్యల్లేని నియోజకవర్గంగా ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం.. 2027 గోదావరి పుష్కరాల నాటికి మరింత వన్నె తెస్తాం అంటున్నారు.. రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు).. ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధిపై శనివారం ఆయన (తరువాయి 8వ పేజీలో)



కాకినాడకు దూసుకొస్తున్న తుఫాన్

- మూడు రోజులు రెడ్ అలెర్ట్
- అప్రమత్తమైన అధికారులు
- రేపు, ఎల్లుండి స్కూళ్లకు సెలవులు
- పీజీఆర్ఎస్ తాత్కాలిక రద్దు
- ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లు
- అధికారులతో కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వైపు మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది. ప్రచండ వేగంతో కదులుతూ తీరం వైపు దూసుకొస్తోంది. కాకినాడ పోర్టు - తుని మధ్య మంగళవారం అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సోమ, మంగళ, బుధవారం మూడు రోజుల పాటు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఉద్యోగుల సెలవులు రద్దు

భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ చేకూరి కీర్తి అప్రమత్తం చేశారు. శాఖల వారీగా బాధ్యతలు నిర్దేశించారు. ఉద్యోగుల సెలవులు రద్దు చేశారు.సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్‌ని తాత్కాలికంగా రద్దు చేశారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు సోమ, మంగళ వారాలు సెలవు ప్రకటించారు. తుఫాను వల్ల 27,28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకా శం ఉందన్నారు. జిల్లాస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ అధికారులు హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులు పంట మాసూళ్లు వాయిదా వేసుకోవాలని సూచించారు.తాగునీటి సర ఫరాకు అంతరాయం రావడానికి వీల్లేదన్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గోదావరి హారతి తుఫాన్ కారణంగా వాయిదా వేశారు.

కాకినాడకు 900 కి.మీ దూరాన



ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం సాయంత్రం నాటికి గంటకు ఏడు కిలో మీటర్ల వేగంతో వాయుగుండంగా కదులుతోంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా, సోమవారం నాటికి తుఫాన్‌గా, మంగళవారం నాటికి తీవ్ర తుఫాన్‌గా బలపడనుంది. ప్రస్తుతానికి పోర్టు బ్లెయి ర్‌కు 440 కి.మీ, విశాఖకు 970 కి.మీ, కాకి నాడకు 900 కిలోమీటర్ల దూరం లో కొనసాగుతోంది. మంగళవారం అర్ధరాత్రికి తీవ్ర తుఫాన్ కాకినాడలో తీరం దాటనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చ రించింది.

కంట్రోల్ రూమ్‌లు ఇవే..

కలెక్టరేట్	8977935611
టోల్‌ఫ్రీ	1070, 112, 1800 425 0101
రాజమమండ్రి ఆర్డీవో	0883 2442344
కొవ్వూరు ఆర్డీవో	7995367797
రాజమండ్రి అర్బన్	08832940695
అనపర్తి	9441386920
బిక్కవోలు	9849903913
గోకవరం	9491380560
కడియం	6301523482
రాజమండ్రి రూరల్	9849903860
రాజానగరం	9494546001
రంగంపేట	9393931667
సీతానగరం	9177096888
కోరుకొండ	9154474851

ఎందుకింత నిర్లక్ష్యం

- అన్నవరం దేవస్థానంలో కార్తీకమాస ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ అసహనం
- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- కూడళ్ల వద్ద భక్తులకు సూచీబోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశం


నూతన మెట్లమార్గాన్ని పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాసం సందర్భంగా భక్తులకు కల్పించిన ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ శనివారం స్వీయ పర్యవేక్షణ చేశారు. భక్తులు స్వామి సన్నిధికి విచ్చేసే స్వాగత ద్వారం వద్దనే నిర్వహణ ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ముందుగా కళాశాల మైదానాన్ని పరిశీలించారు. కళాశాల అనుకుని ఉన్న క్రీడాస్థలం కోసం ఏర్పాటుచేసిన ఫెన్సింగ్‌ను తొలగించడంతో పాటుగా అక్కడక్కడా ఉన్న గోతులను పూడ్చాలన్నారు. టోల్ గేట్ వద్ద శానిటేషన్ సరిగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నూతన మెట్లమార్గాన్ని పరిశీలించారు. ఇంకా అందుబాటులోకి తీసుకురాకపోవడానికి కారణమేంటని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణను ప్రశ్నించారు. మరో వారంరోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రక్షణగోడను రాతితో నిర్మించాలని, మెట్లమార్గంలో కేబుల్ విద్యుత్ కాకుండా సోలార్‌కు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. సీఆర్వో కార్యాలయం పరిశీలించి గదుల ఖాళీల వివరాలు డిస్‌ప్లేలో ఉండేలా చూడాలని, దీనిని రోజు జీపీఎస్ ఫోటో తీసి ఈవో ఫోన్ కు పంపించాలన్నారు. భక్తులకు ఎక్కడా సూచీబోర్డులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఎందుకు నిర్లక్ష్యం వహించారని ప్రశ్నించారు.

శానిటేషన్ నిర్వహణపై ఆగ్రహం..

అనంతరం ఆయన వినాయక అతిథిగృహంలో ఈవో, చైర్మన్, ఏఈవోతో సమావేశమయ్యారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించేవిధంగా చూడాలని వసతిగదులు, అందులో మౌలికవసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విష్ణుసదన్ హాల్స్ పరిశీలించి శానిటేషన్ నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల విశ్రాంతి తీసుకునే హాల్స్‌లో వివాహ డెకరేషన్ మండపాలు ఉండడంతో వివాహం అనంతరం తొలగించేలా చూడాలన్నారు. భక్తుల కోసం నిర్మించిన విశ్రాంతి షెడ్డులో వ్రతం టిక్కెట్లు, ప్రసాదం కౌంటర్లు ఏర్పాటుచేసిన ప్రదేశం సరిగా లేదని దానిని చివరకు మార్చాలని రద్దీసమయంలో హోల్డింగ్ పాయింట్ల వద్ద నిండిన జనం ఈ విశ్రాంత షెడ్డుకు వచ్చేలా చూడాలని సూచించారు. అనంతరం కమాండ్ కంట్రోల్‌రూం వద్ద సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఉద్యోగి తనకు అప్పగించిన బాధ్యతలతో పాటుగా మిగిలిన వాటిలో కూడా భాగస్వామ్యం కావాలన్నారు. శని,ఆది,సోమవారాలతో పాటుగా ఏకాదశి, దశమి, కార్తీకపౌర్ణమి రోజుల్లో ఈవో పశ్చిమరాజగోపురం వద్దనే ఉండి పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. తప్పనిసరిగా రోప్ ఉండాలని దీనిద్వారా తోపులాటలు నివారించవచ్చన్నారు. వాకీటాకీల ద్వారా ఎప్పటికప్పుడు మోనటరింగ్ చేసుకోవాలన్నారు. ప్రధానంగా కార్తీకపౌర్ణమి రోజు చాలా కీలకమైనదని.. ఒకపక్క స్వామి సన్నిధికి వ్రతం, దర్శనం కోసం వచ్చేవారు, మరోపక్క గిరిప్రదక్షిణకు వచ్చేవారి సంఖ్య సుమారు 2లక్షలమంది ఉంటుందని దానికణుగుణంగా వ్యవహరించాలన్నారు. గిరిప్రదక్షణ సమయంలో సత్యరథం తొలిపావంచా వద్ద ఎక్కువసేపు నిలపకుండా 15 నిమిషాల్లో కదపాలన్నారు. గిరిప్రదక్షిణ రోడ్డులో చిన్నచిన్న రాళ్లు ఉంటున్నాయని, అక్కడ రోలింగ్ చేయాలని అదేవిధంగా సుమారు 50 అదనపు టాయిలెట్లు ఉండేలా చూడాలన్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, అధికారులున్నారు

ప్రత్యక్షంగా.. ప్రయోగాత్మకంగా..


విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ

కాకినాడలో ఓపెన్ హౌస్ కార్యక్రమం

విద్యార్థులకు పలు అంశాలు వివరించిన ఎస్పీ బిందుమాధవ్


గన్స్ ఉపయోగాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు



కాకినాడ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ ఉత్సవాల్లో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖకు సంబంధించిన సాంకేతికత పరికరాలు, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్ సామగ్రి, వివిధ ఆయుధాలు, పోలీస్ జాగిలాల పని తీరు, డ్రోన్ల వినియోగం, వేలిముద్రల సేకరణ, బాడీ వార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం, బ్రీత్ ఎనలైజర్స్, సిగ్నల్స్ స్పీడ్ గన్, నేర పరిశోధనలో, బాంబులను గుర్తించడంలో పోలీస్ జాగిలాల పని తీరు, బాంబ్ డిస్పోజల్ పరికరాలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఎస్పీ ప్రత్యక్షంగా.. ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ నెల 27న కూడా నిర్వహిస్తామని విద్యార్థులు, ప్రజలు వచ్చి ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని తిలకించి అవగాహన పెంచుకోవాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కెవి సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.శ్రీహరి, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ


తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

నావల్ ఉన్నతాధికారుల పూజలు

సత్యదేవుడిని శనివారం ఈస్టర్న్ నావెల్ కమాండ్ ఉన్నతాధికారులు బి.శివకుమార్ కటుంబసభ్యులతో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆగమ పాఠశాల ఆహార పదార్థాలందజేశారు.


దర్శనం అనంతరం నావల్ అధికారులు

డ్వాక్రా సొమ్ముల దుర్వినియోగం..
బ్యాంకింగ్ కరస్పాండెంట్‌పై ఫిర్యాదు

కరప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం కూరాడ-1,2, చిన్న మామిడాడలకు చెందిన 74 డ్వాక్రా సంఘ సభ్యులకు చెందిన రూ.99,86,440 పొదుపు, బ్యాంకులోను రుణం సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన బ్యాంకింగ్ కరస్పాండెంట్ చిన్నం ప్రియభారతిపై క్రిమినల్ కేసు నమోదు చేసి రికవరీ చేయాలని కోరుతూ శనివారం డీఆర్‌డీఏ ఏపీడీ ఎం.ఎం.జిలానీ కరప ఎస్ఐ తోట సునీతకు ఫిర్యాదు చేశారు. డ్వాక్రా సంఘ సభ్యులు ఇచ్చిన పొదుపు, లోనుసొమ్ముని బ్యాంకులకు చెల్లించకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పత్రికల్లో కథనాలు,సభ్యుల ఫిర్యాదుతో విచారణ చేయడం జరిగిందని, ఈ విచారణ నివేదిక రిపోర్టు అక్టోబరు 10న ఉన్నతాధికారులకు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రియభారతి తల్లి కూరాడ-2 యానిమేటర్ (వీవోఏ)గా పని చేస్తుందన్నారు. ఆమె కూడా డ్వాక్రా సంఘ సభ్యుల డబ్బులు బ్యాంకుకి జమచేయకపోవడం, కుమార్తె ప్రియభారతికి సహకరించిందన్నారు. ఆమె చేసిన అక్రమాలు, అవకతవకలు కూరాడ -వీవోఏ ఆలపాటి బేబీ, చినమామిడాడ వీవోఏ ఆచంట మాధవికు తెలిసినా చెప్పకుండా సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు. కూరాడ-1లో 28 సంఘాలకు చెందిన పొదుపు,రుణం సొమ్ము రూ.31,47,300, కూరాడ-2లో 32 సంఘాల రూ.57,53,240, చిన మామిడాడకు చెందిన 14 సంఘాలకు 10,85,900 వెరసి మొత్తంగా రూ.99,86,440 సొంతానికి వాడేసుకున్నట్లు విచారణలో నిర్ధారణ చేయడం జరిగిందని తెలిపారు.

కోర్టులో అగ్ని ప్రమాదం


రూ. 4 లక్షల ఆస్తి నష్టం


సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దగ్ధమైన సామగ్రి

కాకినాడ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం రోజు మాదిరిగానే కోర్టు తలుపులు తీసి చూడగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్మేసి ఉండడాన్ని సిబ్బంది గమనించి అధికారులకు తెలియజేశారు. కాగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్లాబ్ లీకయ్యి వర్షపు నీరు కోర్టు హాలులో పడడంతో కరెంట్ షార్ట్ సర్క్యూట్ అయి ఉండవచ్చని సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు తెలిపారు. న్యాయమూర్తి ఆశీనులయ్యే ప్రాంతంలోనే షార్ట్ సర్క్యూట్ సంభవించి కంప్యూటర్, ప్రింటర్‌టేబుల్, కూర్చీల నుంచి 3 ఏసీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరో 4 ఏసీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అలాగే కోర్టు హాలు స్లాబ్, గచ్చు కూడా ధ్వంసమైంది. వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు బృందం ఘటనా స్థలిని పరిశీలించి అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల వ్యాన్‌ను ఢీకొన్న లారీ

పెద్దాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రహదారిలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సమీపంలో కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌ను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఎగ్ ట్రేలు భారీగా కింద పడి వేలాదిగా కోడిగుడ్లు చితికిపోయాయి. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోవడంతో పోలీసులు క్యాబిన్ నుంచి బయటకు తీసి స్థానిక ఆసుపత్రికి తరలించారు.


రోడ్డుపై వ్యాన్ నుంచి పడి చితికిన కోడిగుడ్లు

నిండుకుండలా...

ఏలేరు జలాశయం

దిగువ ప్రాంతాలకు 3000 క్యూసెక్కుల నీరు విడుదల


ఏలేరు జలాశయం

ఏలేశ్వరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయం నిండుకుండలా మారింది. ప్రాజెక్టు నుంచి 3000 క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరిగాయి. మరో 4 రోజుల పాటు వర్షాలు పడే సూచనలతో ఎగువ ప్రాంతంలో కురిసే భారీ వర్షాలతో ప్రాజెక్టులో వరద నీరు చేరి కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం మండలాలకు ప్రమాదం పొంచి ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఏలేరు ప్రాజెక్టులో శనివారం 86.56 మీటర్లకుగాను 85.57 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.10 టీఎంసీలు నీటి నిల్వలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కులు నీటిని, దిగువ ప్రాంతాలకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో పిఠాపురం యువకుడికి కాంస్య పతకం


కాంస్య పతకం సాధించిన సురేష్‌కుమార్

పిఠాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం బొజ్జా వారి తోటకు చెందిన కేతినీడి సురేష్‌కుమార్ కాంస్య పతకం సాధించాడు. ముంబైలోని జస్వంత్‌రావు చౌహాన్ సెంటర్‌లో వరల్డ్ నేచురల్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన పోటీల్లో సురేష్‌కుమార్ పాల్గొన్నాడు. ఓపెన్ ఫిజిక్ కేటగిరీలో జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచాడు. పలువురు అభినందించారు.

నవంబరు 10, 11 తేదీల్లో
'నన్నయ' అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పురుషుల, మహిళల చాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు నవంబరు 10,11 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించి బ్రోచర్‌ను శనివారం ఆమె ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని క్రీడాకారులంతా ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. అతిపెద్ద క్రీడా కార్యక్రమమైన దీనిని సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్ట్స్ కళాశాల వ్యాయామ అధ్యాపకులకు తెలిపారు. అథ్లెటిక్స్‌లో మొత్తం 26 క్రీడాపోటీలు ఉంటాయని, సమష్టిగా కృషి చేసి పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ రామచంద్రరావు ఆర్‌కే మాట్లాడుతూ కళాశాలలోని అన్ని విభాగాలు, పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో అథ్లెటిక్ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. నన్నయ వర్శిటీ పరిధిలోని క్రీడాకారులంతా పాల్గొనాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, క్రీడాబోర్డు సహాయ కార్యదర్శి ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి, కార్యనిర్వాహక సభ్యులు ఎం.ప్రసాద్, పీవీవీ లక్ష్మి, టి.విజయదుర్గ ఉన్నారు.

నేడు 'కవిసంధ్య' దశాబ్ది ఉత్సవం

- యానాంలో సాహితీ పురస్కారాల ప్రదానం
- హాజరుకానున్న మల్లాడి, మండలి బుద్ధప్రసాద్
- పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు శిఖామణి జీవన సాఫల్య పురస్కారం
- యువ పురస్కారం, పది మందికి ప్రతిభా పురస్కారాలు

యానాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వార్తలు, విశేషాలు, విశ్లేషణలకు పత్రికా మాధ్యమమే ప్రధాన స్రవంతి. సామాజిక చైతన్యానికి కరదీపికలుగా ఈనాటికీ పత్రికలే వెలుగొందుతున్నాయి. సాహిత్య సంపదకూ పత్రికలే పట్టుగొమ్మలయ్యాయి. ఇక కేవలం సాహిత్యమే ప్రధానంగా నడిచే పత్రికలు తెలుగునాట అనేకం ఉన్నాయి. కొత్త కవులకు, రచయితలకు ఇవే తొలి పరిచయ వేదికలు.. పదేళ్ల కిందట ఈ సాహిత్య ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే క్రమంలో 'కవిసంధ్య' కూడా సాహితీ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. ప్రముఖ కవి శిఖామణి ఈ కవిసంధ్యకు సంపాదకుడు. కవిత్వం, దానికి అనుబంధంగా కవిత్వపు ధోరణులు, చర్చ, విమర్శలకు మాత్రమే ఇది వేదిక. సాహిత్యంలోనే అనేక ప్రక్రియలను మిళితంగా చేసుకుని పత్రిక నిర్వహించడం వేరు. ఇలా నిర్దేశిత పరిమితులతో ఒకే అంశానికి పరిమితమై ముందుకుసాగడమంటే కత్తిమీద సామే. అయినా సరే, అన్ని సవాళ్లను దాటుకుని పది వసంతాలను కవిసంధ్య పూర్తిచేసుకుని కేంద్ర స్థానం యానాంలో వేడుకను జరుపుకుంటోంది. కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ యానాంలో ప్రతీ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదాన సభతోపాటు ఈసారి కవిసంధ్య దశాబ్ది ఉత్సవం ఆదివారం జరగనుంది. యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణమండపంలో ఈ సభ ఏర్పాటు చేశారు. కవిసంధ్య రథసారథి, కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరవుతారు. శిఖామణి జీవన సాఫల్య పురస్కారం-2025ను ప్రముఖ కవి, రచయిత, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, యువ పురస్కారం ప్రముఖ కవి, విమర్శకుడు అవధానుల మణిబాబు స్వీకరించనున్నారు. వివిధ సాహిత్య ప్రక్రియలతోపాటు పత్రికా రంగానికి సంబంధించి మొత్తం పది మందికి కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందజేస్తారు.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఎమ్మెల్యే, తెలుగుభాషా సంస్కృతుల ప్రేమికుడు మండలి బుద్ధప్రసాద్, ప్రముఖ పద్యకవి ఆజోవిభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, ప్రముఖకవి రచయిత దాట్ల దేవదానంరాజు, ప్రముఖ సాహితీవేత్తలు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ కాళ్లకూరి శైలజ, బొల్లోజుబాబా, కుంచే నాగసత్యనారాయణ, సీహెచ్ రాం, డాక్టర్ గూటం స్వామి తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కవిసంధ్య- ఆరుద్ర, బైరాగి శత జయంతి సంచిక ఆవిష్కరణ జరగనుంది.

కొవ్వూరులో వారాహి అమ్మవారి ఆభరణాల తనిఖీ

4.3 మిల్లీ గ్రాముల బంగారం, 3.5 కిలోల వెండి ఉన్నట్టు గుర్తింపు


ఆభరణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కాకినాడ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులోని శ్రీవారాహి అమ్మవారి ఆలయంలో ఉన్న ఆభరణాలను దేవదాయ, ధర్మదాయశాఖ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణాజిల్లాల జ్యూయలరీ తనిఖీ అధికారి విళ్ల పల్లంరాజు శనివారం పరిశీలించారు. ఆలయ సింగిల్ ట్రస్టీ ఆర్‌సౌజన్య వారాహి అమ్మవారి ఆభరణాలను అధికారికి అందజేయగా కూటమి నాయకులు కరెడ్ల గోవింద, రవి, గ్రామ పెద్దల సమక్షంలో తనిఖీ నిర్వహించారు. మొత్తం 4.3 మిల్లీ గ్రాముల బంగారం, 3.5 కిలోల వెండి ఉన్నట్టు అధికారులు గుర్తించి వాటి వివరాలను అధికారికంగా రిజిస్టర్‌లో నమోదచేశారు. జేవీవో మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 15 కంటే ముందు ఎవరైనా ఆలయానికి ఆభరణాలు ఇచ్చి ఉంటే వాటి వివరాలను తమకు తెలపాలని, వాటిని మాత్రమే దేవదాయ శాఖ రికార్డులో నమోదు చేసి అమ్మ వారికి అలంకరించడం జరుగుతుందని సూచించారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణను పరిశీలించి దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారమందిస్తానని తెలిపారు. ఆభరణాల తనిఖీలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


భీమన్న (ఫైల్)

ద్రాక్షారామ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. ఆలయంలో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో రోజు వారీ కూలీకి గార్డెనర్‌గా ద్రాక్షారామానికి చెందిన దొంగల భీమశంకరం (భీమన్న) (46) పనిచేస్తున్నాడు. భీమశంకరుడు, అతడి కుమారుడు గత కొంతకాలంగా ఆలయంలో తోట పనిచేస్తున్నారు. శనివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఉత్తర గోపురం దగ్గర గడ్డిని యంత్రంతో కట్ చేస్తూ బోర్లా పడిపోయి ఉన్నాడు. పక్కన కటింగ్ మిషన్ తిరుగుతూనే ఉంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఈవో, సిబ్బంది చూసి పక్కనే ఉన్న ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

ఆలయానికి సంప్రోక్షణ

ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఇటువంటి సంఘటన జరగడంతో ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం నుంచి మూసివేసి సంప్రోక్షణ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి తిరిగి స్వామివారి దర్శనం భక్తులకు కలిగించారు.

నకిలీ పోలీసు అరెస్ట్

బంగారు ఉంగరాలు, గొలుసు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ బాలాజీ

నిడదవోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు వేషధారణలో ప్రజలను మోసగిస్తూ నేరాలకు పాల్పడుతున్న విశాఖపట్టణానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో జరిగింది. ఎస్ఐ బాలాజీ సుందరరావు తెలిపిన వివరాల ప్రకారం... నిడదవోలు మండలం శంకరాపురంలో ఈనెల 22న ఒక ఇంట్లో చోరీ చేసి 2 కాసుల బంగారం గొలుసు, ఒక బంగారు ఉంగరం దొంగిలించుకుపోయాడని కాయల మంగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు నిందితుడు విశాఖపట్టణం సీతమ్మధారకు చెందిన ఆదిరెడ్డి అప్పారావును అరెస్టు చేసి విచారించగా అతడిపై 14 కేసులు ఉన్నట్లు వెల్లడైందన్నారు. అతడి నుంచి 3 బంగారు ఉంగరాలు, ఒక బంగారు గొలుసు, బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీస్ అని చెప్పి ప్రజలను మోసగిస్తుంటాడని తెలిసిందన్నారు. 14 పాత కేసులతో పాటు కోరంగి పోలీస్ స్టేషన్, గోకవరం పోలీస్ స్టేషన్, గండేపల్లి పోలీస్ స్టేషన్, కరప పోలీస్ స్టేషన్, రాజమండి టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 6 నేరాలు చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. అతడిని కోర్టుకు పంపుతామన్నారు. సమావేశంలో ఎస్ఐ జె.కల్పన సిబ్బంది ఉన్నారు.

'స్పందన'లో రూ.1.44 లక్షలు మాయం

ఆరుగురిపై కేసు నమోదు

అమలాపురం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎర్రవంతెన వద్ద ఉన్న స్పందన ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో రూ.1.44లక్షలు నగదు మాయం చేసిన ఆరుగురిపై శనివారం అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు కేసు నమోదు చేశారు. స్పందన ఫైనాన్స్ కార్పొరేషన్‌లో లోన్ రికవరీ అధికారులుగా పనిచేస్తున్న వారి బండారం ఆడిట్‌లో బయటపడింది. స్పందన మేనేజర్ పలివెల వినోద్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోన్ రికవరీ అధికారులుగా పనిచేస్తున్న కాసా కార్తీక్, గెద్దం కుమార్, దాసరి విష్ణుప్రకాష్, కోసూరి గోపి, కోసూరి ప్రేమ్‌కుమార్, చిన్నారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు పేర్కొన్నారు.

నిబంధనలు పాటించని 4 బస్సులు సీజ్


దివాన్‌చెరువులో బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖాధికారులు

ఎంవీఐ సంపత్‌కుమార్

దివాన్‌చెరువు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని నాలుగు బస్సులను సీజ్ చేశామని రాజమహేంద్రవరం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సంపత్‌కుమార్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సులను జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద రవాణాశాఖ అధికార్లు శనివారం తనిఖీలు చేశారు. బస్సుల రికార్డులు తనిఖీ చేసి సిట్టింగ్, భద్రత ప్రమాణాలు, పన్ను చెల్లింపులు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవీఐ సంపత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి కొవ్వూరు సమీపంలో జరిపిన తనిఖీల్లో రెండు, శనివారం దివాన్‌చెరువు వద్ద జరిపిన తనిఖీల్లో రెండు బస్సులను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ రెండు రోజుల తనిఖీల్లో 17 కేసులకు సంబంధించి రూ.1,40, 450లను చలానా రూపంలో వసూలు చేసినట్టు పేర్కొన్నారు. వారంలో రెండు రోజులు బస్సులను తనిఖీ చేస్తున్నామని, అయితే కర్నూలు జిల్లాలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో తీవ్రతరం చేశామన్నారు. తనిఖీల్లో ఎంవీఐలు ఎం.రవికుమార్, సీహెచ్‌వీ రమణ, ఏఎంవీఐలు కె.చైతన్యసుమ, వీవీడీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు ఇళ్ల నిర్మాణానికి కృషి: సోము

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదలకు గృహాలను నిర్మించాలనే సంకల్పంతో ప్రధాని మోదీ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని తన క్యాంపు కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎంఏవై గ్రామీణ 2.0 పథకం అమలు చర్యలపై హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాలకు అందిస్తున్న రూ.2,50,000 ఆర్థిక సహాయం మాదిరిగానే గ్రామీణ ప్రాంతాల్లోనూ అదే స్థాయిలో సహాయం అందించే అంశాన్ని పరిశీలిస్తూ సీఎం చంద్రబాబు, హౌసింగ్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఆయన అధికారులకు సూచించారు. తాను కూడా ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని సోము వీర్రాజు పేర్కొన్నారు. హౌసింగ్ ఈఈ రాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో
నాగులచవితి


రాజమహేంద్రవరంలోని జడ్జి బంగ్లా సమీపంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

» పాము పుట్టల వద్ద పూజలు
» నాగేంద్రుడికి పాలు పోసిన భక్తులు
» గుడ్లు, చలిమిడి, చిమ్మిలి నైవేద్యం
» పలుచోట్ల తీర్థ వాతావరణం

దివాన్‌చెరువు/రాజానగరం/గోకవరం/రాజమహేంద్రవరం కల్చరల్/బిక్కవోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన్ని శనివారం గ్రామగ్రామాన భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువఝామునే నిద్రలేచి పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం చలిమిడి, చిమ్మిలి, పాలు పండ్లు, బుర్రగుంజు వంటివి వెంట తీసుకుని కుటుంబ సమేతంగా పొలాలు, తోటల్లో ఉన్న పుట్టల వద్దకు భక్తులు చేరుకున్నారు. తొలుత పుట్టలను పరిశుభ్రం చేసి, పుట్ట చుట్టూ పసుపు నీళ్లు చల్లి, ముగ్గులు వేసి, పువ్వులతో అందంగా అలంకరించారు. ఆపై పసుపు కుంకుమలతో పూజలు చేసి తమ వెంట తెచ్చిన చలిమిడి, చిమ్మిలి, కోడి గుడ్లు, తేగముక్కలను నైవేద్యంగా సమర్పించారు. బుర్రగుంజు, గుడ్లు వంటివి పుట్టల్లో వేసి ఆవుపాలు పోసి పూజలు చేశారు. పూజలు అనంతరం పుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పుట్ట మన్నును దూదితో అద్ది చెవులకు ధరించారు. కొందరు నాగుల తువ్వాళ్లను పుట్టలపై కొద్దిసేపు కప్పి తిరిగి తమ భుజాలపై ధరించారు. అలా చేస్తే, సంతాన ప్రాప్తి కలుగుతుందని, సర్పదోషాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. చిన్నారులు పుట్టలవద్ద బాణసంచా కాల్చారు. స్థానికులతో బాటు సమీపంలోని రాజమహేంద్రవరం వాసులు కొందరు ఇక్కడి పరిసరాల్లోని పుట్టల వద్దకు తమ కుటుంబ సభ్యులతో కలసి వచ్చి పుట్టల్లో పాలు పోశారు. నాగదేవత ఆశీస్సులు కోరుతూ ఘనంగా ఈ పండుగను జరుపుకున్నారు. రాజమహేంద్రవరంలోని పలుచోట్ల తీర్థ వాతావరణం కనిపించింది. ఆర్ట్స్ కాలేజీ, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, జడ్జి బంగళా, ఎస్పీ బంగళా, ఆర్‌అండ్‌బీ క్వార్టర్స్, సెంట్రల్ జైలు, సుబ్రహ్మణ్య నగర్, జేఎన్ రోడ్ ప్రభు గార్డెన్స్ పరిసర ప్రాంతాలు, శేషయ్య మెట్ట, రోడ్ కం రైలు బ్రిడ్జి, బర్మా కాలనీ,నారాయణపురం, లాలాచెరువు, బొమ్మూరు, మోరంపూడి, శాటలైట్ సిటీ, నామవరం, పిడింగొయ్యి, కాతేరు, కొంతమూరు, కోలమూరు తదితర ప్రాంతాలల్లో పుట్టల దగ్గర నాగుల చవితి పండుగ సందడి నెలకొంది. కోరుకొండ బిజిలీ ఐస్ ఫాక్టరీ రోడ్డులోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సంతాన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం, నారాయణపురంలోని నాగమ్మతల్లి గుడి, గోదావరి గట్టులోని ఉమా మార్కండేయ స్వామి ఆలయం,శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీ విశ్వేశ్వరాలయం, జాంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, నాగేంద్రుడి ప్రతిమలకు భక్తులు వెళ్లి పూజలు చేపట్టారు. బిక్కవోలులోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో సహజ సిద్ధమైన పుట్టతో దర్శనమిచ్చే ప్రాచీన శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. స్వామి చెంతనే వున్న నాగేంద్రుడికి ఆవుపాలు, తేగలు, బుర్రగుంజు, చలిమిడి, చిమ్మిలను భక్తులు సమర్పించారు. అలాగే పలువురు భక్తులు పొలాల్లోని పుట్టల వద్ద నాగుల చవితి నిర్వహించుకున్నారు.


దివాన్‌చెరువులో పుట్టకు నమస్కరిస్తున్న భక్తులు

విజనరీ నాయకుడు చంద్రబాబు


బుర్రిలంకలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల

రోడ్డు ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్

కడియం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆనాడు హైదరాబాద్‌లో హైటెక్‌సిటీని తయారు చేసినా.. ఈనాడు ఐటీ రంగాన్ని ముందుకు తీసుకెళుతున్నా అది విజనరీ నాయకుడు సీఎం చంద్రబాబుకే దక్కుతుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలో ఎన్‌ఆర్ ఈజీఎస్, మండల పరిషత్ నిధులు రూ.2.05 కోట్లతో నిర్మించిన రోడ్డును శనివారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రానికి కృత్రిమ మేధ (ఏఐ)ను తీసుకొచ్చిన ఘనత సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకే దక్కుతుందని అన్నారు. పర్యాటకాభి వృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. విశాఖకు గూగుల్ రాకతో అనేక మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. మాజీ సీఎం జగన్ అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నారన్నారు. 12 దేశాలతో కనెక్టవిటీ చేయగలిగిన ప్రపంచ స్థాయి గుగుల్ డేటా సెంటర్ విశాఖకు వస్తే స్వాగతించాల్సింది పోయి విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కడియం నర్సరీలు పర్యాటకంగా మరింత అభివృద్ధి సాధించేలా కూటమి చర్యలు చేపడుతుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అడు గులు వేస్తున్నామన్నారు. నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు పుష్కరాల నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదిశెట్టి పద్మావతి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసా ద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, గట్టి నర్సయ్య, డా.గోరంట్ల రవిరామ్‌కిరణ్, పాటంశెట్టి రాంజీ, బోడపాటి గోపి, పంతం గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలి

బిక్కవోలు/సీతానగరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని బిక్కవోలు, సీతానగరం మండలాల ప్రత్యేకాధికారులు టి.శ్రీదేవి, రాంప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. తుఫానుపై గ్రామాల్లో టాంటాం వేయించాలని, గ్రామాల్లో వర్షం నీరు నిలిచి ఉండకుండా చూడాలని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. రైతులు వరి కోతలు నిలిపివేయాలని, కోసిన పంట తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలువలు పొంగి పొర్లే చోట ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలని, మండల స్థాయి అధికారులు కింది స్థాయి అధికారులను ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. సమావేశాల్లో పలువురు అధికారులు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్ట్

గోకవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాలకు చెందిన 12మంది జూదరులను శనివారం అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. మల్లవరం గ్రామంలో కోడి పందాల శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసి, రూ.17,000 నగదు, కొత్తపల్లిలో బొమ్మ-బొరుసు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3,200 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నన్నయ యూనివర్శిటీ అభివృద్ధికి సహకరిస్తాం

దివాన్‌చెరువు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో వీసీ ప్రసన్నశ్రీకి తమవంతు సహాయసహకారాలు అందిస్తామని రాష్ట్ర ఆడిట్ జోన్-2 ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ బి.క్రాంతికుమారి అన్నారు. శనివారం ఆమె వీసీ ప్రసన్నశ్రీని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై వారు చర్చించారు. అనంతరం క్రాంతికుమారి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థతో తనకున్న అనుభవంతో వర్శిటీకి తోడ్పాటు అందిస్తానన్నారు. భవిష్యత్‌లో నైపుణ్యాభివృద్ధి, ఫారిన్ లాంగ్వేజ్ ప్రోగ్రామ్స్‌కు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి

గోకవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గాడాలలో ఇటీవల దళిత యువకుడిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఈనెల 26న కోరుకొండలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గోకవరంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దళిత యువకుడిపై దాడి కేసులో 9మందిని నిందితులుగా గుర్తించిన పోలీసులు నలుగురిపైనే కేసు నమోదు చేసి ఈ కేసును నీరు గార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరుతూ చేపట్టే ధర్నాకు దళితులంతా రావాలని కోరారు.సమావేశంలో గోకవరం,కోరుకొండ, సీతానగరం మండలాల దళిత నాయకులు పాల్గొన్నారు.

కూటమితోనే శాలివాహనుల అభివృద్ధి

రంగంపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే కుమ్మర, శాలివాహనుల అభివృద్ధి జరుగుతుందని కుమ్మర,శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాలిపర్తి వేమన అన్నారు. మండలాధ్యక్షుడు చెరుకువాడ నరసింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం రంగంపేటలో నిర్వహించిన కుమ్మర,శాలివాహన సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఆదరణ పథకం ద్వారా కుమ్మరి కులస్థులకు పనిముట్లను ఇచ్చి కులవృత్తులను ప్రోత్సాహించారన్నారు. ఈ సందర్భంగా సంఘ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకువాడ నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కొలుకులూరి మురళి, కోశాధికారిగా పసలపూడి నాగేంద్రకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కపిలేశ్వరపు హనుమాన్ సాయికుమార్, కార్యదర్శిగా శంకర్రావు, మరో ఆరుగురిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నుకున్నారు. అనంతరం వేమనను సత్కరించారు.

'ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి'

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బహుజన సమాజ్ పార్టీ రాజమహేంద్రవరం ఇన్‌చార్జి గుమ్మాపు చిత్రసేన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, జిల్లా నాయకులు ఇసుకపట్ల రాంబాబులతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగితే ప్రభుత్వం పట్టించుకోకుండా వివక్ష చూపుతోందని ఆరోపించారు. మధురపూడికి చెందిన పాముల శ్రీనుపై గాడాలకు చెందిన అగ్రవర్ణాల యువకులు దాడిచేశారని, ఈ ఘటనలో నలుగురిని మాత్రమే అరెస్ట్ చేశారన్నా రు. రాంబాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోని ఎస్సీ కాలేజీ బాలుర హాస్టల్-1లో మెనూ బాగోలేదని అన్నందుకు విద్యార్థులపై పోలీసులకు ఫిర్యాదు చేశారని, పలురకాలుగా బెదిరించారన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి ఏఎస్‌డబ్ల్యువో, డీఎస్‌డబ్ల్యుఓలపై చర్యలు తీసుకోవాలని లేకుంటే రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని, ఆందోళన చేపడతామన్నారు. బాలికల హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని అన్నారు. విజయకుమార్ మాట్లాడుతూ మధురపూడి సంఘటన జరిగి నెలరోజులు కావస్తున్నా సరైన విచారణ జరగడం లేదన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ఆయన బిక్కవోలులో నేలకొరిగిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 15 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా అకాల వర్షాలకు 3690 ఎకరాల్లో పంట నేల కొరిగిందన్నారు. తుఫాను కారణంగా రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని, అధికారులు రైతులకు అందుబాటులో ఉండి పూర్తి నష్టం అంచనా వేయాలన్నారు. కార్యక్రమంలో పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి,గొర్రెల త్రిమూర్తులు,సింగారపు రామారావు, గుణ్ణం రమేష్‌చౌదరి, ఏడీఏ కృష్ణ, తహశీల్దార్ సత్యకృష్ణ, ఏవో శామ్యూల్‌జాన్ పాల్గొన్నారు.

వరికి గిట్టుబాటు ధర పోస్టర్ ఆవిష్కరణ

అనపర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాక ముందే ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే ధాన్యానికి గిట్టుబాటు ధర ప్రకటించడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక ఏఎంసీ కార్యాలయంలో చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ డైరెక్టర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తుపాను నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనూరి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశానికి కొందరు అధికారులు డుమ్మా కొడుతూ సబార్డినేట్లను పంపిస్తున్నారని, ఇది సరికాదన్నారు.ఈ సందర్భంగా కేంద్రం జీఎస్టీని సరళీకృతం చేసిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు, అనపర్తిలో జన్మభూమి రైలు హాల్టుకు కృషి చేసిన ఎంపీ పురందేశ్వరికి, ఎమ్మెల్యే నల్లమిల్లికి కృతజ్ఞతలు తెలిపే తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ వెలుగుబంటి సత్యనారాయణ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


బిక్కవోలులో కుళ్లిన వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

జనార్దన స్వామి ఆలయంలో పూజలు

స్థానిక జనార్దనస్వామి ఆలయంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.ఆకాశ దీపానికి పూజలు నిర్వహించి ధ్వజ స్థంభంపై దీప ప్రజ్వలన చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు
ప్రోత్సాహం: కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక రంగానికి అనుబంధ పరిశ్రమలను స్థాపించే దిశగా అధికారులు ఔత్సాహికులను ప్రోత్సహించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సచించారు.కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన శాఖలు పోస్ట్ హార్వెస్టింగ్ యూనిట్లు, పశుసంవర్ధక శాఖ పాల ఉత్పత్తుల పరిశ్రమలు, మత్స్యశాఖ చేపల సీడ్స్, ఫీడ్ ఉత్పత్తి యూనిట్ల స్థాపనకు ప్రోత్సాహక చర్యలు తీసుకోవాలన్నారు. వడిశలేరులో ఫర్నీచర్ క్లస్టర్,కలవచర్లలో క్రూసిబుల్స్ పరిశ్రమతో పాటు సిరమిక్ క్లస్టరు ఏర్పాటు చర్యలు తీసుకోవాలన్నారు.

మరో 20 ఏళ్లు కూటమిదే అధికారం

యాళ్ల ప్రదీప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముందస్తు పుట్టినరోజు వేడుకలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముందస్తు పుట్టినరోజు వేడుకలు



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 20 ఏళ్లపాటు కూటమి అధికారంలో ఉంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు.స్థానిక నటరాజ్ థియేటర్ రోడ్డులో యాళ్ల ప్రదీప్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు యాళ్ల ప్రదీప్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాసు పుట్టినరోజు సందర్భంగా ముందస్తు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా 2వేల మంది పేదలకు ఐదు కిలోల చొప్పున రైస్ బ్యాగ్‌ల ను పంపిణీ చేశారు. దీనికి ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల ఆలోచనకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నానన్నారు. అసత్య ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు తన మంచితనాన్ని చేతకానితనంగా భావించవద్దని అన్నారు. ప్రదీప్ మాట్లాడుతూ వాసుపై పోటీ చేసి ఓడిపోయిన భరత్‌రామ్ తట్టుకోలేక ఆయనను ఈవీఎం ఎమ్మెల్యే అంటున్నారని, కాని రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి వాసు ఎవ్రీటైం ఎమ్మెల్యే అని భవిష్యత్తులో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, రాచపల్లి ప్రసాద్, తెలుగు మహిళ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకుపతిగా బాధ్యతలు స్వీకరించిన డి.మునిరత్నం నాయుడుని శనివారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి మొక్కను అందజేశారు.

పుష్కరాల నాటికి మరింత వన్నె తెస్తాం!

(ఐదో పేజీ తరువాయి)

సమీక్షించారు. ఇంతవరకూ జరిగినవి, పుష్కరాల నాటికి చేయాల్సిన పనులపై ప్రస్తావించారు. రాజమహేంద్రవరంలో ఇప్పటి వరకూ రూ.278 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద గతేడాది రూ.కోటి,ఈ ఏడాది రూ.11 కోట్లు ఖర్చు చేశాం.రాజమహేంద్రవరం చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.6.38 కోట్లు సీఎస్‌ఆర్ ఫండ్స్ సాధించాం. ఇది ఆల్‌టైం రికార్డు. ఇప్పటి వరకూ 235 మందికి రూ.2.67 కోట్లు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందించాం. ఇంకా 80 వరకూ ఇవ్వవలసి ఉంది. ప్రభుత్వ బోధనాసుపత్రిని గాడిలో పెట్టా. ఓపీ 11 వేలకు చేరింది. ఏపీ పేపరుమిల్లు సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించి కార్మికులకు అండగా నిలబడ్డాను. 14 సమర్థవంతమైన ఎండోమెంట్ కమిటీలను వేశాం. కొన్నేళ్లుగా ఇతర పార్టీల పాలనలో ఉన్న ఆర్యాపురం, జాంపేట అర్బన్ బ్యాంక్‌ల పాలకవర్గాలు, ది.రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్‌ను టీడీపీకి దక్కేలా చేశాం. ప్రధాన కూరగాయల మార్కెట్‌కు బొమ్మూరు సమీపంలో ఎండోమెంట్ భూమి కేటాయించాం. సిటీలో ఉన్న నాలుగెకరాల స్థలంలో పీపీపీ విధానంలో మల్టీప్లెక్స్ వంటివి నిర్మించి కార్పొరేషన్‌కు ఆదాయం తెచ్చేలా ఆలోచిస్తున్నాం. శాంతిభద్రతలు బాగుంటేనే అందరూ బాగుంటాం. నగరంలో క్రైమ్ రేట్ తగ్గింది. బ్లేడ్‌బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లను నియంత్రించాం. గత వైసీపీ పాలనలో ఇవి ఎక్కువగా ఉండేవి. మహిళలకు రక్షణలేదు.ఇది గమనించి కూటమి నేతలతో కలసి మీ భద్రత-మా బాధ్యత పేరుతో డివిజన్లలో 35మీటింగ్‌లు పెట్టి 60 వేల మంది మహిళలతో మాట్లాడాను. పోలీసుల సహకారంతో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాం.2027 గోదావరి పుష్కరాల నాటికి రివర్‌ఫ్రంట్, అఖండగోదావరి ప్రాజెక్టు పూర్తి చేయడం, శాశ్వత కట్టడాల మీదే ప్రభుత్వం ప్రధాన దృష్టి పెడుతోంది. ఇంకా చాలా డివిజన్లలో ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరిస్తున్నాం. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి హైటెక్ బస్టాండ్ నుంచి ఆల్టర్నేట్ డ్రైనేజి నిర్మించనున్నాం. వానాకాలంలో పలు ప్రాంతాల ముంపు నీటిని కేవలం గంటలోపే లాగేసేటట్టు చేయనున్నాం. పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 25 జంక్షన్లను గుర్తించాం. ఓల్డ్ సిటీకి ఏవిధమైన ఇబ్బంది డ్యామేజీ లేకుండానే విస్తరణ పనులు చేయనున్నాం. తోపుడు బళ్లవ్యాపారులకు రెడ్ జోన్ అనేది లేకుండా చూసి, గ్రీన్, ఎల్లో జోన్లలో వ్యాపారాలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇలా రాజమహేంద్రవరంపై తనకో ఆలోచన ఉందని.. దానికి తగినట్టుగానే అభివృద్ధికి అడుగులు వేస్తున్నానని అన్నారు.

నిడదవోలులో నకిలీ పోలీస్ అరెస్ట్ | ఇసుక ర్యాంపులో అధికారుల తనిఖీ | డిసెంబరు 13న లోక్‌అదాలత్ | 8

పుష్కరాల నాటికి మరింత వన్నె తెస్తాం!

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
సమస్యల పరిష్కారమే లక్ష్యం.. ఆ దిశగా ఒక్కొక్క అడుగు వేసుకుంటూ వస్తున్నా.. ఎందుకంటే నా చిన్నతనం నుంచి ఇక్కడే పెరిగా.. రాజమహేంద్రవరంతో నాకెంతో అనుబంధం ఉంది. ఎక్కడ ఏ సమస్య ఉందనేది నాకు తెలుసు.. అందుకే గెలిచిన వెంటనే ప్రధాన సమస్యలపై దృష్టి సారించా.. ఈ ఏడాదిన్నరలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఇప్పటికే రూ.278 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఐదేళ్లలో సమస్యల్లేని నియోజకవర్గంగా ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం.. 2027 గోదావరి పుష్కరాల నాటికి మరింత వన్నె తెస్తాం అంటున్నారు.. రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు).. ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధిపై శనివారం ఆయన (తరువాయి 8వ పేజీలో)

భయ మొంథా!



కాకినాడకు దూసుకొస్తున్న తుఫాన్

రాజమహేంద్రవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వైపు మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది. ప్రచండ వేగంతో కదులుతూ తీరం వైపు దూసుకొస్తోంది. కాకినాడ పోర్టు - తుని మధ్య మంగళవారం అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సోమ, మంగళ, బుధవారం మూడు రోజుల పాటు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

- మూడు రోజులు రెడ్ అలెర్ట్
- అప్రమత్తమైన అధికారులు
- రేపు, ఎల్లుండి స్కూళ్లకు సెలవులు
- పీజీఆర్ఎస్ తాత్కాలిక రద్దు
- ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లు
- అధికారులతో కలెక్టర్ సమీక్ష

కాకినాడకు 900 కి.మీ దూరాన



ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం సాయంత్రం నాటికి గంటకు ఏడు కిలో మీటర్ల వేగంతో వాయుగుండంగా కదులుతోంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా, సోమవారం నాటికి తుఫాన్‌గా, మంగళవారం నాటికి తీవ్ర తుఫాన్‌గా బలపడనుంది. ప్రస్తుతానికి పోర్టు బ్లెయి ర్‌కు 440 కి.మీ, విశాఖకు 970 కి.మీ, కాకి నాడకు 900 కిలోమీటర్ల దూరం లో కొనసాగుతోంది. మంగళవారం అర్ధరాత్రికి తీవ్ర తుఫాన్ కాకినాడలో తీరం దాటనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చ రించింది.

ఉద్యోగుల సెలవులు రద్దు

భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ చేకూరి కీర్తి అప్రమత్తం చేశారు. శాఖల వారీగా బాధ్యతలు నిర్దేశించారు. ఉద్యోగుల సెలవులు రద్దు చేశారు.సోమవారం జరగాల్సిన పీజీఆర్ఎస్‌ని తాత్కాలికంగా రద్దు చేశారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు సోమ, మంగళ వారాలు సెలవు ప్రకటించారు. తుఫాను వల్ల 27,28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకా శం ఉందన్నారు. జిల్లాస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ అధికారులు హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులు పంట మాసూళ్లు వాయిదా వేసుకోవాలని సూచించారు.తాగునీటి సర ఫరాకు అంతరాయం రావడానికి వీల్లేదన్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గోదావరి హారతి తుఫాన్ కారణంగా వాయిదా వేశారు.

కంట్రోల్ రూమ్‌లు ఇవే..

కలెక్టరేట్	8977935611
టోల్‌ఫ్రీ	1070, 112, 1800 425 0101
రాజమమండ్రి ఆర్డీవో	0883 2442344
కొవ్వూరు ఆర్డీవో	7995367797
కొవ్వూరు	9866778416
నిడదవోలు	9440580856
గోపాలపురం	7569856778
దేవరపల్లి	9705818045
నల్లజర్ల	9491041451
చాగల్లు	9441293856
తాళ్లపూడి	7993636666
పెరవలి	08819232179
ఉండ్రాజవరం	9491041474

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

భక్తిశ్రద్ధలతో ... నాగుల చవితి

• పుట్టల్లో పాలు, గుడ్లు వేసి నాగేంద్రుడిని ప్రార్థించిన భక్తులు • బాణసంచా కాల్చిన యువత



కొవ్వూరు పట్టణంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు, తదితరులు

కొవ్వూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో శనివారం నాగుల చవితిని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచే గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, పంట పొలాల్లోని పుట్టల వద్దకు చేరుకుని నాగేంద్రుడికి పాలు, గుడ్లు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా గోష్పాదక్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు చేశారు. క్షేత్రంలోని రావిచెట్ల వద్ద ఉన్న నాగశిలలకు గోదావరి జలాలు, పాలతో అభిషేకించారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణం, మండలంలో శనివారం నాగుల చవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే పొలాల్లోని పుట్టల వద్దకు చేరుకుని దీపారాధనతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుట్టలో పాలుపోసి నాగదేవతను వేడుకున్నారు. సమిశ్రగూడెంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న నాగదేవత మందిరం వద్ద భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అలాగే కార్తీక మాసం కావడంతో పట్టణంలోని చిన కాశీ రేవు వద్ద ఉన్న కాలువలో తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

పెరవలి: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం నాగుల చవితి సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున పుట్టల వద్దకు తరలి వెళ్లి పాలు పోశారు. కానూరు, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, అజ్జరం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, తదితర గ్రామాల్లో పొలం గట్లు, కాలువ గట్లుపైన గల పుట్టల్లో భక్తిశ్రద్ధలతో పాలు పోసి పూజలు నిర్వహించారు.

చాగల్లు: మండలంలోని ఆయాగ్రామాల ప్రజలు నాగులచవితిని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే లేచి చలివిడి, నువ్వులపప్పు, పాలు, గుడ్లను పట్టుకుని పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లారు. సెంటర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి గుడి రద్దీగా కనిపించింది. రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలో నాగుల చవితి సందర్భంగా భక్తిశ్రద్ధలతో భక్తులు పుట్టలో పాలు పోసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు మహిళలు, పిల్లలతో పొలాల్లోని పుట్టల వద్ద పూజలు నిర్వహించారు. పాలు, గుడ్లు, బెల్లంతో తయారు చేసిన చిమిలి నైవేద్యంగా సమర్పించారు. దేవరపల్లి సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నాగేంద్రుడికి పూజలు నిర్వహించారు.

గోపాలపురం: మండలంలోని ఆయా గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాగేంద్రుడికి ఆయాగ్రామాల శివారులోని పొలాల వద్ద గల పుట్టల్లో పాలు పోసి కోడిగుడ్లను నైవేద్యంగా సమర్పించారు. యువత, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో..



దేవరపల్లిలో ..



కానూరులో ..



చాగల్లులో ..

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28, 29 తేదీల్లో తుఫాన్ రానున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరిక జారీచేయడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. ఆ సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. ముఖ్యంగా రైతులు ధాన్యం ఆరబోసినట్టయితే ఎత్తివేసుకుని గిడ్డంగుల్లో భద్రపరచుకోవాలని సూచించారు. అలాగే తుపాను కారణంగా వరి పండించే రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించి, పంట నష్టాన్ని తగ్గించుకోవాలని కొవ్వూరు మండల వ్యవసాయాధికారి ఏ. గంగాధర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను వర్షాలకు ముందుకు వరి కోయరాదు. కోసిన పూర్తిగా ఆరని పనలను కుప్పలుగా వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పు పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవాలి. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిసినట్టయితే గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలన్నారు.

ఉండ్రాజవరం: ఈనెల 26వ తేదీ నుంచి 29 వరకు తుఫాన్ కారణంగా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చాగల్లు: వాతావరణ శాఖ తుపాను హెచ్చరిక దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎం. మెరికమ్మ తెలిపారు. ఆదివారం నుంచి బుధవారం వరకు తుపాను ప్రభావం తీవ్రంగా ఉండబోతుందని వాతావరణ శాఖ వారి ముందస్తు హెచ్చరికను అనుసరించి జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని నష్టం వాటిల్లితే కంట్రోల్‌రూం నెంబరు 94412 93856 నకు తెలియజేయాలని కోరారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణ పరిధిలో మంత తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి 30 వరకు మున్సిపల్ కార్యాలయంలో తుపాను కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. తుపాను సమయంలో సహాయార్థం 08813226053 నెంబరును సంప్రదించాలన్నారు.

గోపాలపురం: ముంచుకొస్తున్న మంతా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి భాగ్యవతి సిబ్బందికి సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 28,29 తేదీల్లో తుఫాన్ తీరందాటే సమయంలో తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో రాజమనోహర్, ఎస్సై మనోహర్, ఆయాశాఖల మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : శేషారావు

ఉండ్రాజవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శనివారం నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, నిడదవోలు మండలం, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన 38 మంది లబ్ధిదారులకు రూ. 23.80 లక్షల చెక్కులను వేలివెన్నులో అందజేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ పేద ప్రజలు తమ అనారోగ్య పరిస్థితుల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నందుకు గాను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి డబ్బు అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మన వెంకటేశ్వరరావు, సింహాద్రి రామకృష్ణ, తిరుపతి సత్యనారాయణ, అత్తిలి సత్యనారాయణ, బూరుగుపల్లి శ్రీనివాసరావు, ఈర్పిన సత్యనారాయణ, ముదునూరి రవీంద్రరాజు, ఆయాగ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేలివెన్నులో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న శేషారావు

ప్రజలను మోసగిస్తున్న నకిలీ పోలీసు అరెస్టు

• బంగారు ఉంగరాలు, గొలుసు స్వాధీనం

నిడదవోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసు వేషధారణలో ప్రజలను మోసగిస్తూ నేరాలకు పాల్పడుతున్న విశాఖకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన శనివారం సమిశ్రగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై బాలాజీ సుందరరావు తెలిపిన వివరాలివి... శంకరాపురంలో ఈ నెల 22వ తేదీన ఒక ఇంట్లో చోరీకి పాల్పడి రెండు కాసుల బంగారం గొలుసు, ఒక ఉంగరం దొంగిలించుకుపోయినట్టు కాయల మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు ముద్దాయి విశాఖ పట్టణం సీతమ్మధారకు చెందిన ఆదిరెడ్డి అప్పారావును అరెస్టు చేసి విచారించారు. కాగా, అతనిపై 14 కేసులు ఉన్నట్టు వెల్లడైందన్నారు. అలాగే అతని వద్ద నుంచి మూడు బంగారు ఉంగరాలు, ఒక బంగారు గొలుసు, దొంగతనాలకు ఉపయోగించే బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇతడు పోలీస్ అని చెప్పి ప్రజలను మోసగిస్తుంటాడని, 14 పాత కేసులతో పాటు కోరంగి, గోకవరం, గండేపల్లి, కరప, రాజమండ్రి టూ టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం ఆరునేరాలు చేసినట్టు అంగీకరించాడన్నారు. ఎస్సై జె.కల్పన సిబ్బంది ఉన్నారు.



అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ బాలాజీ సుందరరావు

పాదయాత్రగా శబరిమలకు పయనం

నల్లజర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోతినీడుపాలెంకు చెందిన వీఆర్వో మంచిరాజు ఫణికుమార్ రామశింగవరం వీఆర్వోగా పని చేస్తున్నాడు. ఆయన 31వ సారి అయ్యప్ప మాల ధరించి పాదయాత్రగా శబరిమల యాత్రకు బయలు దేరాడు. ఆయనతో పాటు మరో ముగ్గురు, చింతలపూడికి చెందిన 20 మంది స్వాములు గత నెల 11వ తేదీన పాదయాత్ర ప్రారంభించి 1300 కిలోమీటర్లు నడిచి ఈనెల 13వ తేదీన శబరిమలకు చేరుకున్నారు. 17వ తేదీన గుడి తెరిచే వరకు అక్కడే బస చేసినట్టు గురుస్వామి ఫణికుమార్ తెలిపారు. రోజూ 35 నుంచి 40 కిలోమీటర్ల పాదయాత్ర సాగేదని ఒక్క రోజు మాత్రం 48 కిలో మీటర్లు నడిచినట్టు చెప్పారు. మార్గం మధ్యలో వర్షాల వల్ల అక్కడక్కడ అంతరాయం ఏర్పడిందన్నారు.



యరుమేలిలో గురుస్వామి ఫణికుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పుష్కరాల నాటికి మరింత వన్నె తెస్తాం!

(ఐదో పేజీ తరువాయి)

సమీక్షించారు. ఇంతవరకూ జరిగినవి, పుష్కరాల నాటికి చేయాల్సిన పనులపై ప్రస్తావించారు. రాజమహేంద్రవరంలో ఇప్పటి వరకూ రూ.278 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద గతేడాది రూ.కోటి, ఈ ఏడాది రూ.11 కోట్లు ఖర్చు చేశాం. రాజమహేంద్రవరం చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.6.38 కోట్లు సీఎస్ఆర్ ఫండ్స్ సాధించాం.ఇది ఆల్‌టైం రికార్డు. ఇప్పటి వరకూ 235 మందికి రూ.2.67 కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించాం. ఇంకా 80 వరకూ ఇవ్వవలసి ఉంది. ప్రభుత్వ బోధనాసుపత్రిని గాడిలో పెట్టా. ఓపీ 11 వేలకు చేరింది. ఏపీ పేపరుమిల్లు సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించి కార్మికులకు అండగా నిలబడ్డాను. 14 సమర్థవంతమైన ఎండోమెంట్ కమిటీలను వేశాం. కొన్నేళ్లుగా ఇతర పార్టీల పాలనలో ఉన్న ఆర్యాపురం, జాంపేట అర్బన్ బ్యాంక్‌ల పాలకవర్గాలు, ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్‌ను టీడీపీకి దక్కేలా చేశాం. ప్రధాన కూరగాయల మార్కెట్‌కు బొమ్మూరు సమీపంలో ఎండోమెంట్ భూమి కేటాయించాం. సిటీలో ఉన్న 4 ఎకరాల స్థలంలో పీపీపీ విధానంలో మల్టీప్లెక్స్ వంటివి నిర్మించి కార్పొరేషన్‌కు ఆదాయం తెచ్చేలా ఆలోచిస్తున్నాం. శాంతి భద్రతలు బాగుంటేనే అందరూ బాగుంటాం. నగరంలో క్రైమ్ రేట్ తగ్గింది. బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లను నియంత్రించాం. గత వైసీపీ పాలనలో ఇవి ఎక్కువగా ఉండేవి. మహిళలకు రక్షణలేదు. ఇది గమనించి నేను మా కూటమి నేతలతో కలసి మీ భద్రత- మా బాధ్యత పేరుతో డివిజన్లలో 35 మీటింగ్‌లు పెట్టి 60 వేల మంది మహిళలతో మాట్లాడాను. పోలీసుల సహకారంతో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాం. 2027 గోదావరి పుష్కరాల నాటికి రివర్‌ఫ్రంట్, అఖండ గోదావరి ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు శాశ్వత కట్టడాల మీదే ప్రభుత్వం ప్రధాన దృష్టి పెడుతోంది. ఇంకా చాలా డివిజన్లలో ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరిస్తున్నాం. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి హైటెక్ బస్టాండ్ నుంచి ఆల్టనేట్ డ్రైనేజీ నిర్మించనున్నాం. వానాకాలంలో పలు ప్రాంతాల ముంపు నీటిని కేవలం గంటలోపే లాగేసేటట్టు చేయనున్నాం. పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం 25 జంక్షన్ల గుర్తించాం. ఓల్డ్ సిటీకి ఏవిధమైన ఇబ్బంది డ్యామేజీ లేకుండానే విస్తరణ పనులు చేయనున్నాం. తోపుడు బళ్లవ్యాపారులకు రెడ్ జోన్ అనేది లేకుండా చూసి, గ్రీన్, ఎల్లో జోన్లలో వ్యాపారాలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇలా రాజమహేంద్రవరంపై తనకో ఆలోచన ఉందని.. ఆ ఆలోచనకు తగినట్టుగానే అభివృద్ధికి అడుగులు వేస్తున్నానని అన్నారు.

షర్మిల సమావేశానికి హాజరైన అరుణకుమారి

పెరవలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎన్నికల సంఘంలో జరుగుతున్న అవకతవకలపై ఎంపీ రాహుల్‌గాంధీ లేవనెత్తిన ఐదు అంశాలపై సంతకాల సేకరణ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ అరిగెల అరుణ కుమారి తెలిపారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నట్టు చెప్పారు.

ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే..

తాళ్లపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేటకి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా... కేవలం 24 గంటల్లోనే ఆమె ఆచూకీ కనుగొన్నారు. వివరాలివి... సదరు యువతి చదువు సాగక ఇంటి వద్దే ఖాళీగా ఉంటోంది. దీంతో తల్లితండ్రులు మందలించడంతో ఆమె ఇంటి నుంచి పారిపోయింది. ఈ మేరకు పోలీసులు శుక్రవారం మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టగా బంధువుల ఇంటి వద్ద ఉన్న ఆమెను తీసుకొచ్చి శనివారం ఆమె తల్లితండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ టీ. రామకృష్ణ, ట్రైనీ ఎస్‌ఐ ఆదిత్య శ్రీనివాస్, ఎస్‌డీ కానిస్టేబుల్ రాజు యాదవ్, హెచ్‌సీ శ్రీనివాసు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో గానామృతం

దేవరపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తీకమాసం కావడంతో ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు చేశారు. చిట్లు నాగవెంకట వరప్రసాద్, నాగమణి దంపతులు స్వామివారికి అలంకరణ, ప్రసాదం చేయించారు. సాయంత్రం చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన శ్రీరాధాశ్యామ్ కల్యాణ భజన మండలి ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం, గానామృతం ఘనంగా జరిగింది.

టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారుల తనిఖీ

కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని రీజనల్ విజిలెన్స్ టాస్క్‌ఫోర్సు ఏడీ టి.కిషోర్ హెచ్చరించారు. వాడపల్లి ఇసుకర్యాంపులో శనివారం టాస్క్‌ఫోర్సు అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని వచ్చిన అధికారుల నివేదికపై తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. రీజనల్ పరిధిలో రెండు బృందాలు ఇసుక ర్యాంపులలో పర్యటించి రికార్డులు పరిశీలించాయి. తనిఖీలలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరమణ, పి.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనలో ఉపాధ్యాయుడు కీలకం

• ఎంపీడీవో రాజమనోహర్



పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీడీవో రాజమనోహర్, ప్రిన్సిపాల్ ఫణికిషోర్

గోపాలపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని ఎంపీడీవో జీ.రాజమనోహర్ అన్నారు. స్థానిక శర్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 2025 డీఎస్సీలో ఎంపికైన ఆ పాఠశాల పూర్వ విద్యార్థులను యాజమాన్యం శనివారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాపాక ఫణికిషోర్ ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ క్రమశిక్షణ,కు సంకల్పం తోడై ఉపాధ్యాయులకు అనుబంధంగా ఉన్న ప్రతీ విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు : ఎంపీడీవో

పెరవలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 23 నుంచి 30 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. అలాగే ఐదు నుంచి 17 ఏళ్ల వయస్సు గల పిల్లలకు ఉచితంగా బయోమెట్రిక్ నవీకరణ జరుగుతోందన్నారు.

జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష

కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో డిసెంబరు 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ తెలిపారు. శనివారం దీనిపై కోర్టు ప్రాం గణంలో పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాల గురించి తెలుసుకున్నారు. ఎన్ని పెండింగ్ కేసులున్నాయి. అందులో ఎన్ని రాజీమార్గంలో పరిష్కారమవుతాయని అడిగారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, డీఎస్పీ జీ.దేవకుమార్, సీఐలు, ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న అదనపు జిల్లా జడ్జి అనురాధ

తాళ్లపూడి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ ప్రోగ్రాం



విద్యార్థినులకు పలు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

తాళ్లపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేగేశ్వరపురం జూనియర్ కళాశాల విద్యార్థినులతో ఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నెలకొన్న పరిస్థితులను తెలియజేస్తూ, పలు జాగ్రత్తల గురించి వివరించారు. మహిళా పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన సదస్సులు

కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యాన్ని నివారించడానికి కూటమి ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను తీసుకువచ్చిందని మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని అన్నారు. శనివారం టీడీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రజల భద్రత స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సురక్షా యాప్‌పై అవగాహన కల్పించారు. దాయన రామకృష్ణ, అర్జిల్లి రామకృష్ణ, తోరం నగేష్, కుప్పాల ప్రసాద్, ఆకుల నగేష్, పాకా జయరామ్, బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేర్రాజు పాల్గొన్నారు.



కొవ్వూరులో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

చాగల్లు: ఏపీ సురక్ష యాప్‌పై మందుబాబులకు కూటమి నాయకులు అవగాహన కల్పించారు. చాగల్లులోని వైన్‌షాపు వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు పాల్గొని వైన్‌షాపును సందర్శించారు. వివిధ రకాల సీసాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివ నాగేంద్ర,మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, కూటమి నాయకులు తాళ్లూరి ప్రసాద్, దొంగ రామకృష్ణ, ఆళ్ల సూర్యప్రకాశరావు, మిరియాల సతీష్, అబ్బూరి సీతారాముడు, తాళ్ళూరి శ్రీనివాసరావు, బాబీ, వీరవల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ పడిన ఇరువర్గాలపై కేసు

కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి డాబా వాడుకునే విషయమై ఇరువర్గాలు ఘర్షణపడిన ఘటనలో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. వాంబేకాలనీలో నందూరి వెంకటలక్ష్మి, గాడి నాగరత్నం నివాసముంటున్నారు. అనంతరం ఒకరికొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మతం కాదు .. మానవత్వం ఉండాలి

• బిషప్ డాక్టర్ గెడ్డం విలియమ్స్

తాళ్లపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మనిషికి మతం ముఖ్యం కాదు ... మానవత్వం అవసరమని తుపాకులగూడెంకి చెందిన బిషప్ డా. గెడ్డం విలియమ్స్ అన్నారు. ఈమేరకు ఆదివారం జరగనున్న విలియమ్స్ పుట్టినరోజు సందర్భంగా శనివారం జనసేన పార్టీ సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది తొర్లపాటి సీతల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొద్దిరోజుల క్రితం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి 17 ఆక్సిజన్ సిలెండర్లు అందించారు. కాగా, నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా అన్నదేవరపేట పీహెచ్‌సీకి ఒక ఏసీ, కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెండు ఏసీలు, వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మెంబర్ కే.లక్ష్మి, జీ.మనీష్‌బాబు, గెడ్డం మధుబాబు, గెడ్డం రాహుల్, బంగార్రాజు, పాపారావు, పురుషోత్తం, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తొర్లపాటి సీతల్, లక్ష్మి, తదితరులు

బాలికలపై అత్యాచారాలను అరికట్టాలి

• బీహెచ్‌ఎస్ఆర్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీ అండ్ పీజీ కాలేజీ విద్యార్థుల ర్యాలీ



దేవరపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కాలేజీ విద్యార్థులు

దేవరపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం దేవరపల్లి బీహెచ్‌ఎస్ఆర్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీ అండ్ పీజీ కాలేజీ విద్యార్థులు బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, అలాగే బాలికలకు సమాజంలో గౌరవం ఇవ్వాలని పెద్దఎత్తున డిగ్రీ కాలేజీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరపల్లి ట్రైనీ ఎస్సై దినేశ్, ఏఎస్సై గంగాధర్, శక్తి టీమ్ మహిళా కానిస్టేబుల్ బాలాకుమారి పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలకు గురవుతారని, అందువల్ల మహిళలతో పాటు యువకులు కూడా చట్టాలపై అవగాహన కలిగి ఉండాల న్నారు. దీనిలో భాగంగా చట్టాలను గౌరవిస్తూ క్రమశిక్షణతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.